శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విజయవంతంగా అమలు చేశాం

- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

కావలి, మే 18, ప్రభాతవార్త: ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి మత్స్యకారులకు ప్రభుత్వం అండగా వుంటుందనే భరోసా కల్పిస్తూ మత్స్యకారుల సేవలో పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కావలి రూరల్ మండలం, తుమ్మలపెంట నుంచి లాంఛనంగా ప్రారంభిస్తున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు.సోమవారం తుమ్మలపెంటలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి మంత్రి ఆనం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూడా సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్‌సిక్స్ పథకాలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సముద్రంలో చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించేందుకు మత్స్యకారుల సేవలో పథకం ద్వారా అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం 20వేలు ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్న మంత్రి,గతంలో 10వేలు ఇస్తున్న ఈ ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేసి 20 వేలు చొప్పున ఒక్కొక్క కుటుంబానికి సీఎం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున మొత్తం 261 కోట్ల రూపాయల నగదును సీఎం మత్స్యకారుల ఖాతాలకు జమచేయనున్నారు. జిల్లాలో 11,644 మంది లబ్ధిదారులకు 28 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యలు పాటిస్తూ బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ముఖ్యమంత్రి జిల్లాకు రాక

- మత్స్యకార సేవలో పథకం ప్రారంభించనున్న సీఎం

- జిల్లాలో 11,644 మంది మత్స్యకారులకు రూ.23 కోట్లు లబ్ధి



నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం జిల్లాలోని కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో పర్యటించనున్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించేందుకు మత్స్యకారుల సేవలో పథకాన్ని తుమ్మలపెంట నుంచి లాంఛనంగా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా ఏటా సముద్ర వేట నిషేధ సమయంలో అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం రూ.20,000 ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. గతంలో రూ. 10వేలు ఇస్తున్న ఈ ఆర్థికసాయాన్ని రెట్టింపు చేసి రూ. 20వేలు చొప్పున ఒక్కొక్క కుటుంబానికి సీఎం అందించనున్నారు. చేపల పునరుత్పత్తి కోసం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు (దాదాపు 61 రోజుల పాటు) విధించే సముద్ర వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను నివారించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,30,796మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ. 20వేలు చొప్పున మొత్తం రూ. 261 కోట్ల నగదును సీఎం మత్స్యకారుల ఖాతాలకు జమ చేయనున్నారు. జిల్లాలో 11,644 మంది లబ్ధిదారులకు రూ.28 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

జీన్-హెన్రీ డ్యూనాంట్ విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, కావలి ఎమ్మెల్యే

: రెడ్‌క్రాస్ సభ్యులను సత్కరించిన కలెక్టర్, ఎమ్మెల్యే

కావలి, మే 18 ప్రభాతవార్త : పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి భవనం వద్ద అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకుడు జీన్‌హెన్రీ డ్యూనాంట్ విగ్రహాన్ని దాతలు కలికి శ్రీహరిరెడ్డి, కలికి పవన్‌రెడ్డిల సహకారంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు కలసి ఆవిష్కరించి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సభ్యులు,సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన వారికి జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే మెమోంటోలు అందజేసి సత్కరించారు.

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందని సేవా కార్యక్రమాలలో సభ్యులందరూ చూపుతున్న అంకితభావంతో ప్రశంసనీయమని తెలిపారు. రక్తదానం, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు ద్వారా ప్రజలకు అండగా నిలువాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో సేవాభాంతో పనిచేసే సంస్థల్లో రెడ్‌క్రాస్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా పేరు చెబితే కావలి రెడ్‌క్రాస్ సేవలు ప్రత్యేకంగా గుర్తుకు వచ్చే స్థాయికి తీసుకెళ్లిన సభ్యులందరికి అభినందనలు తెలిపారు. రోటరీక్లబ్,ఐయంఏ, టీం సేవియర్స్ లాంటి వివిధ సేవా సంస్థలు కూడా రెడ్‌క్రాస్‌తో కలిసి సామాజిక సేవల్లో భాగస్వామ్యం కావడంసంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు డి. రవిప్రకాష్, కె.హరినారపరెడ్డి, డాక్టర్ పామూరు శ్రీధర్, ఏ.రమేష్‌రెడ్డి, మోదరన్ నరసింహారావు, బెజవాడ ప్రసన్నకుమార్, ఓరుగంటి వెంకటేశ్వరులు, ఇలింద్ర, శ్రీవాణి, గొట్టిపాటి మనోరమ, జనిగర్ల మనోహర్, జి.హరనాథ్, యం.జమున, రెడ్‌క్రాస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పెట్రోల్ డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైసిపి ర్యాలీ

- కలెక్టరేట్ వరకు రిక్షా తొక్కిన కాకాణి, చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త ఎక్కడా లేనివిధంగా ఈరోజు ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ 120 రూపాయలు పైగా డీజిల్ 103 రూపాయలు పైగా చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని వైసీపీ ఆధ్వర్యంలో వైసిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు మాజీ మంత్రి కాకాని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ ర్యాలీలో చంద్రశేఖర్ రెడ్డి, కాకాణి రిక్షాలు తొక్కి నిరసన నిరసన వ్యక్తం చేశారు నెల్లూరు బార్ కాసు నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వో విజయ్ కుమార్‌కు, వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాన్యులకు చుక్కలు చూపిస్తుందని ధరలు నియంత్రణకు తీసుకొని వస్తుంది అంటూనే విద్యుత్ చార్జీలు అమాంతంగా పెంచేసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారని ఈ సందర్భంగా మండిపడ్డారు. అనంతరం మాజీమంత్రి కాకాని మాట్లాడుతూ ఈరోజు ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ కృత్రిమంగా కొరత చూపిస్తూ వాటిని ప్రజలు అధిక ధరకు కొనిపించడం దుర్మార్గమని కొనియాడారు. ఈ రోజు రాష్ట్రంలో విపరీతంగా మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడి గా అమ్ముతున్నారని దీనివల్ల ప్రజలు తీవ్ర స్థాయిలో ఇబ్బందు లు పడుతున్నారని కాకాని తెలియజేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, మే 18, ప్రభాతవార్త : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 0క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 52.019 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 2500 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.671 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

నిర్ణీత గడువులోపు అర్జీల పరిష్కరణ

- పరిష్కార వేదికకు 322 అర్జీలు - అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిష్కరించాలి

- ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ఉండకూడదు

- నిర్దేశిత గడువులోపల సమస్యను పరిష్కరించాలి - వివరాలను అర్జీదారులకు తెలియపరచాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, తెలుగు గంగ ప్రత్యేక అధికారులు కేశవర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ, ఐటిడిఏ పిఒ శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్లు ప్రజల నుండి అధ్యయనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు, పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతోపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

- పరిష్కార వేదికకు 322 అర్జీలు సోమవారం మొత్తం 322 అర్జీలు లాగా దాంతో ప్రధానంగా రెవెన్యూ 132, మునిసిపల్ శాఖ 29, సర్వే ల్యాండ్ రికార్డ్స్ 22, పోలీస్ శాఖ 28, మరిన్ని తదితర శాఖలు ఉన్నాయి.

రాపూరు..చిట్వేలి ఘాట్ రోడ్డులో ఆదుపుతప్పి లోయలో పడ్డ లారీ

రాపూరు, మే 18, ప్రభాతవార్త రాపూరు..చిట్వేలి ఘాట్ రోడ్డులో ఆదివారం ఆర్ధరాత్రి రాజంపేట నుండి కట్టెలలోడుతో వస్తున్న లారీ ఆదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జు,నుజ్జు కాగా లారీలోని డ్రైవర్‌కు స్వల్ప గాయలయినట్లు తెలుస్తుంది. ఘాట్ రోడ్డులోని రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో పాటు రోడ్డుకు రక్షణగా వున్న రక్షిత గోడలు పూర్తిగా పడిపోయాయి. దీంతో ఘాట్ రోడ్డులో పెద్ద ఎత్తున ప్రమాదాలు జరిగి, ప్రాణనష్టం కూడా సంబవించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. అయితే రోడ్డు మరమత్తులకు సంబంధించి ఇప్పటి వరకు ఆర్‌అండ్‌బి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలువాయి పిహెచ్‌సి నందు ఎక్సెరే పరీక్షలు

కలువాయి మే 18 ప్రభాతవార్త మండలకేంద్రమైన కలువాయిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఇంటెన్స్ ఫైడ్ టి.బి 2.0 ప్రోగ్రామ్‌కు సంబంధించి హైరిస్క విలేజిలలో హ్యాండ్ హెల్డ్ ఎక్స రేమిషన్ డ్రైవులో భాగంగా సోమవారం డాక్టర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రజలకు ఎక్సెరే పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి.బి ,లెప్రసీ, డాక్టర్ ఖాదర్‌వల్లీ ఆదేశాల మేరకు మండల ప్రజలకు ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వైద్యాధికారి విజయలక్ష్మీ తెలిపారు. టి.బి వ్యాధిని త్వరగా కనుగొని సకాలంలో మందులు అందించడం లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వైద్యులు తెలిపారు.ఈకార్యక్రమంలో డాక్టర్ ఆశిత,పిహెచ్‌సి సిబ్బంది టిబి సూపర్‌వైజర్లు టి.ఒ కృష్ణమరాజు, ఎస్‌టి శబరినాద్, ఎస్‌సిఎల్‌హెచ్ సుధాకర్ పాల్గొన్నారు.

టాక్టర్‌ని ఢీకొన్న స్కూటీ ఒకరు మృతి

కలిగిరి, మే 18, ప్రభాతవార్త ; మండల కేంద్రమైన కలిగిరి సమీపంలో (పర్రే హజరత్47)స్కూటీ ప్రమాదంలో మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాలమేరకుకలిగిరి పంచాయితీలోని జిర్రావారిపాలెంకు చెందిన హజరత్ కలిగిరికి వచ్చి కూరగాయలు కొనుక్కొని తిరుగు ప్రయాణంలో స్కూటీపై వెళ్తుండగా కలిగిరి సమీపంలోనికరెంట్ సబ్‌స్టేషన్ సమీపంలో ముందు వెళ్తున్న టాక్టర్ని చీకటిలో గమనించక టాక్టరు వెనుక బాగంలో స్కూటీ ఢీకొట్టింది.స్కూటీ డీకోట్టిన ప్రమాదంతో మృతుడుఅక్కడికక్కడే మృతి చెందాడు. కలిగిరి పోలీసులు సంఘటనా స్తలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలిగిరి ఏయస్ఐ రామచంద్రయ్య తెలిపారు.కాగా మృతుడు బెల్దారీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిచుకుంటున్నాడని ఇంటి యజమాని చనిపోవడంతో కుటుంభం పెద్దదిక్కును కోల్పోయిందని స్తానికులు తెలుపుతున్నారు. మృతునికి ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు.

శ్రీకలువాయమ్మ సేవలో మాదాసు

కలువాయి మే 18 ప్రభాతవార్త మాజీ శాసనమండలి సభ్యులు మాదాసు గంగాదరం కలువాయి గ్రామ దేవత శ్రీకలువాయమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మాదాసులు సారె సమర్పించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో దేవాలయ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. అమ్మవారి దర్శన అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అమ్మవారి ప్రతిమను ఆయనకు అందజేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరు పాడి పంటలతో సుఖసంతోషంగా ఉండాలని, ఈ సందర్భంగా ఆమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని మాదాసు గంగాధరం తెలిపారు. భవిష్యత్తులో ప్రజా సేవకు అడుగులు వేసేందుకు కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మాదాసు అభిమానులు శ్రేయోభిలాషుల నుండి ఉద్దేశించి మాట్లాడారు.

వ్యాపారం కాదు.. పేద పిల్లల చదువే నా లక్ష్యం మంత్రి నారాయణ

- నెల్లూరులో పరుగులు పెడుతున్న అభివృద్ధి - ప్రభుత్వ స్కూళ్లకు ఇంటర్నేషనల్ బుక్

- రెండేళ్లలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నదీ జలాలు

- నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 761 కోట్లతో అభివృద్ధి పనుల జాతర

- 40 కోట్లతో నెల్లూరులో తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన

నెల్లూరు, మే 18, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. కార్పొరేషన్ పరిధి మొత్తం మీద 761 కోట్ల భారీ వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కాగా, 54వ డివిజన్‌లో 350 కిలో లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు నిర్మాణానికి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భూమిప ఊజ చేశారు. అనంతరం 14వ డివిజన్ ఏసీ నగర్ మల్లెల సంజీవయ్య స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన క్లాస్ రూం బల్లలపై కూర్చొని నాణ్యతను పరిశీలించారు. విద్యార్థిగా తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. మంత్రి నారాయణకు స్థానిక ప్రజలు, మహిళలు అడుగడుగున నీరాజనాలతో బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి వెళ్లారని ఆరోపించారు. ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడకుండా ముందుకు సాగుతున్నారన్నారు. సంపద సృష్టిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 14,000 కోట్లతో అమృత్ పథకం పనులు జరుగుతున్నాయని, రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన జడీ జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నెల్లూరులోని ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని, వక్ఫ్‌బోర్డు స్థలంలో 20 కోట్లతో వీఆర్సీకి ధీటుగా మరో ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్ నిర్మిస్తున్నామని ప్రకటించారు. వ్యాపార దృక్పథంతో మాస్తే నా పిల్లల నారాయణ విద్యాసంస్థల కోసం ప్రభుత్వ స్కూళ్లను నేను అభివృద్ధి చేయకూడదు. కానీ, పేరిక నిర్మూలన కేవలం విద్యాభివృద్ధితోనే సాధ్యమని నమ్మి, ప్రతి పేద విద్యార్థికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయన్నారు. పీ4 విధానం ద్వారా పేదలకు అండగా ఉంటామని చెబుతూ, స్కూళ్ల డెవలప్‌మెంట్‌కు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గంలో మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా 54వ డివిజన్‌లో 40 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం కింద 350 కేఎల్ సామర్థ్యం గల ఈఎల్ఎస్ఆర్ తాగునీటి ప్రాజెక్టుకు, 5 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ లైన్, 12 కిలోమీటర్ల సబ్ లైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారన్నారు. అలాగే బాలాజీ నగర్ 14వ డివిజన్‌లోని మల్లెల సంజీవయ్య మెమోరియల్ స్కూల్‌లో అదనపు తరగతి గదులను ప్రారంభించడంతో పాటు, మూలాపేట, ఆర్ఎస్ఆర్ స్కూల్స్ వంటి ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దే బాధ్యతలను ఆయన కుమార్తె శరణి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా, నగర పాలక సంస్థ పరిధిలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న మొత్తం 8,400 మంది విద్యార్థులలో 7,000 మంది విద్యార్థులకు మంత్రి నారాయణ తన సొంత నిదులతో త్వరలోనే ఉచితంగా హీరో కంపెనీ సైకిళ్లను పంపిణీ చేయనున్నారన్నారు. భారతదేశంలో ఇలాంటి నాయకుడి తమ జీవితంలో మాడలేదన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులను అందించాలనే సంకల్పంతో సొంత నిదులను వెచ్చిస్తూ నారాయణ సార్ చేస్తున్న ఈ సేవలను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. పదో తరగతిలో 580 మార్కులు సాధించిన మల్లెల సంజీవయ్య స్కూల్ విద్యార్థినులను సన్మానించి మంత్రి నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, అడిషనల్ కమీషనర్ హిమబిందు, మేయర్ సుజాత అశోక్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, 54వ డివిజన్ టీడీపీ నేతలు జమీర్, షాహీద్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సంక్షేమం, వారి కళ్ళలో సంతోషం చంద్రబాబు లక్ష్యం

- వేట విరామ సాయంతో వారికి ముఖ్యమంత్రి అండగా నిలుస్తున్నారు

నెల్లూరు, మే 18, ప్రభాతవార్త మత్స్యకార పక్షపాతి కూటమి ప్రభుత్వం, రెండో ఏడాది వేట విరామ సాయంను ప్రకటించడంతో పాటు మత్స్యకార లబ్ధిదారుల సంఖ్యను పెంచింది. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.20వేల సాయంను రేపు ప్రభుత్వం అందించనుంది. వేట నిషేధ సమయంలో ఏ ఒక్క మత్స్యకార కుటుంబం వస్తు ఉండరాదని తలచి, నాడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని హామీని నేడు కూటమి ప్రభుత్వం నెరవేర్చుతోంది. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటోంది. వారికి పరిహారం సకాలంలో అందిస్తోంది. 262 కోట్ల రూపాయలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.30 లక్షల మత్స్యకార కుటుంబాల ఖాతాల్లో జమ చేసే బృహత్తర కార్యక్రమంకు తుమ్మలపెంటని ఎంచుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా గంగపుత్రుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తలపెట్టిన కార్యక్రమంను జయప్రదం చేయాలని టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర కోరారు.

మొక్కుబడిగా రైతులకు సబ్సిడీ యంత్ర పరికరాలు

దగదర్తి, మే 18, ప్రభాతవార్త రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ యంత్ర పరికరాలు మొక్కుబడిగా ఇస్తామంటున్నారని మండలంలోని రైతులు వాపోతున్నారు. మండలంలో ఉన్న 20 గ్రామ పంచాయతీలలోని రైతులకు గాను ఒకే ఒక్క ట్రాక్టర్ సబ్సిడీలో ఇస్తామని వ్యవసాయాధికారులు ప్రకటించడంపై ముక్కున వేలేసుకుంటున్నారు. మండలంలో సుమారు 12 లక్షల 28 వేల రూపాయల సబ్సిడీ విలువతో ఒక ట్రాక్టర్, ఒక గడ్డి చట్టే యంత్రం, రెండు పవర్ టిల్లర్లు, ఒక దాట్ మిల్, రెండు పవర్ రీడర్లు, 22 పవర్ స్ప్రేయర్లు, 3 ట్రాక్టర్ సంబంధించిన వ్యవసాయ యంత్ర పరికరాలు, ఎస్సీలకు నాలుగు స్ప్రేయర్లు, ఒక ట్రాక్టర్ యంత్ర పరికరం, ఎస్టీలకు కేవలం ఒకే ఒక స్ప్రేయర్ అందజేసేందుకు ఈనెల 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారులు ప్రకటించారు. సబ్సిడీపై అందించే ఈ పరికరాలపై గ్రామాలలో ఎవరికి ఇవ్వాలో అధికార పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మరి ఇంత దారుణంగా మొక్కుబడిగా వ్యవసాయ యంత్ర పరికరాలు ఇస్తామనడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికి సబ్సిడీపై ట్రాక్టర్‌లు వ్యవసాయ యంత్ర పరికరాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌లను నియమించాలి

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్ రెడ్డి

గూడూరు, మే 18, ప్రభాతవార్త : రాష్ట్రంలోని వ్యవసాయ, పశువైద్య, ఉద్యాన మత్స్య విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు ఆర్డీవో సత్యనారాయణకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ సేవలు, పశుసంపద అభివృద్ధి, ఉద్యానవన పురోగతి, మత్స్య సంపద వృద్ధి, గ్రామీణ నవకల్పన, ఆహార భద్రతను బలోపేతం చేయడంలో వ్యవసాయ, పశువైద్య, ఉద్యాన, మత్స్య విశ్వవిద్యాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. సమర్థవంతమైన విద్య, పరిపాలనా నాయకత్వంపై ఆధారపడి ఉండే వేలాది మంది విద్యార్థులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, రైతులు, భాగస్వాములకు ఇవి సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం వైస్ ఛాన్సలర్ల కార్యాలయాలలో ఇన్చార్జ్/తాత్కాలిక ఏర్పాట్లు లేదా ఖాళీలు దీర్ఘకాలం కొనసాగడం వలన విద్యా పరిపాలన, విధాన నిర్ణయాలు, నియామకాలు, పదోన్నతుల ప్రక్రియలు, పరిశోధన సమన్వయం, నిధుల సమీకరణ కార్యక్రమాలు, అక్రిడిటేషన్, సహకారాలు, సంస్థాగత అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, రైతు ఆధారిత కార్యక్రమాల సకాల అమలు తదితరాల అంశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ విశ్వవిద్యాలయాల సమగ్ర పరిపాలన, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళిక, విద్యా నైపుణ్యం, సంస్థాగత స్వయం ప్రతిపత్తి, పారదర్శకత, పరిపాలనా స్థిరత్వాన్ని కాపాడటానికి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ల నియామకం చాలా కీలకమైనదన్నారు. సరైన ఎంపిక ప్రక్రియ ద్వారా జరిగే క్రమబద్ధమైన నియామకాలు ఈ ప్రముఖ సంస్థల విశ్వసనీయతను, సామర్థ్యాన్ని, అభివృద్ధిని ఎంతగానో పెంపొందిస్తాయన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ, పశువైద్య, ఉద్యాన, మత్స్య విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లను వెంటనే నియమించాలన్నారు. ఈయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్. ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

గూడూరు, మే 18, ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని ఏరియా అసుపత్రి నందు ఎన్‌సిడి క్లినిక్ 333 నందు ప్రపంచ రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. అనంతరం వైద్యులుక్యాన్సర్ స్క్రీనింగ్,రక్తపోటు, మధుమేహనికి సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిడి మెడికల్ ఆఫీసర్, లక్ష్మి నారాయణ, డాక్టర్ వేలమూరి సాయి శృతి, నర్సింగ్ అధికారిణిలు ప్రసన్న, ఐశ్వర్య, అశ్విని పాల్గొన్నారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులకు ఆహ్వానం

గూడూరు, మే 18, ప్రభాతవార్త : గూడూరు ఆర్టీసీ డిపో నందు డ్రైవర్లుగా పని చేయుటకు ఆన్ కాల్ బేసిస్ మీద దరఖాస్తులను చేసుకోవాలని ఆర్టీసి డిపో మేనేజర్ సిహెచ్ చెంచు లక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి కనీసం 18 నెలల అనుభవంతో ఉన్నవారి నుండి దరఖాస్తులు ఆహ్వానించారు. వీరిని అవసరమైనప్పుడు మాత్రమే డ్యూటీలకు పిలుస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి మే 25 లోపల దరఖాస్తులు గూడూరు డిపో మేనేజర్ ఆఫీస్ నందు ఇవ్వవల్సిందిగా ఆర్టిసి డిపో మేనేజర్ తెలియజేసారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి

- మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షులు సుభాన్

గూడూరు, మే 18, ప్రభాతవార్త : ఆన్లైన్ మందులు విక్రయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన కార్యక్రమంలో భాగంగా గూడూరులో జరగనున్న బంద్ ను విజయవంతం చేయాలని గూడూరు డివిజన్ మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కె సుభాన్ పిలుపునిచ్చారు. సోమవారం గూడూరు పట్టణం సొసైటీ ఓ అపార్ట్మెంట్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనాలో కూడా ప్రాణాలు అడ్డుపెట్టి 24 గంటలు మందుల షాపులను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. అలాకాకుండా ఆన్లైన్ విధానంలో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా డోర్ డెలివరీ చేయడం వల్ల చిన్న, చితక మెడికల్ షాప్ నిర్వహించుకునే యజమానులు వీధిన పడుతున్నారని తెలిపారు. అద్దె రూము తీసుకుని అర్హత గల కెమిస్ట్‌లతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెడికల్ షాపు నిర్వహించుకోవాలంటే ఖర్చుతో కూడిన పని అయినందువల్ల ఈ ఆన్లైన్ విధానం అందరికీ నష్టం కలిగిస్తుంది అని తెలిపారు. అందువల్ల ఆన్లైన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీన గూడూరులో జరుగు బంద్ కు అందరూ మెడికల్ షాప్ నిర్వాహకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 20వ తేదీ అనగా బుధవారం గూడూరు పట్టణం టవర్ క్లాక్ నుండి నిరసన ర్యాలీగా బయలుదేరి ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తామని దుకాణదారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో గూడూరు డివిజన్ మెడికల్ షాప్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జి మురళి యాదవ్, ఎం దయాకర్ యాదవ్ ,కృష్ణ ప్రసాద్, ఎస్కే సందాని భాష, సిహెచ్ వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించండి

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త : బక్రీద్ పర్వదిన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సోమవారం సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తులదినంలో కలెక్టర్ శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లను నిర్వహించాలన్నారు నమాజు నిర్వహించుకునేందుకు స్టాటర్ హౌస్ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయి ంచాలన్నారు. శాశ్వత స్టాటర్ హౌసులు నిర్మించాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేయా లన్నారు. విద్యుత్ ట్రాఫిక్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇమామ్ భాష తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాలో అనర్హులను తొలగించండి

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త : మత్స్యకార భరోసాలో అనర్హులను తొలగి ంచాలని సోమవారం ముత్తుకూరు మండలానికి చెందిన మత్స్యకారులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్ శుక్లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఏడాది మత్స్యకార భరోసా నిర్వహిస్తుందన్నారు. కానీ అందులో పలువురు అనర్హుల పేర్లను నమోదు చేసి అర్హుల పేర్లను నమోదు చేయలేదన్నారు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. అందువల్ల కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి ఉద్యోగాలు స్థానికులకు కేటాయించండి

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త : అంగన్వాడి ఉద్యోగాలలో స్థానికులకే కేటాయించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో గిరిజన సంక్షేమ సేవా సంఘం కార్యదర్శి కొమరగిరి మహేంద్ర బాబు తన అనుచరులతో కలిసి కలెక్టర్ శుక్లకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తమ ఎస్టీ కాలనీలో ఆయా అంగన్వాడి టీచర్ పోస్టులు ఉన్నాయని వాటిని స్థానికులకు కేటాయించకుండా స్థానికేతురులకు కేటాయిస్తున్నారన్నారు ఇది అంగన్వాడి ఉద్యోగాల ఏర్పాటుకే విరుద్ధమన్నారు. ఈ విషయమై అనేక సార్లు మండల స్థాయి అధికారులకు జిల్లా అధికారులకు సమర్పించిన ఫలితం లేదన్నారు. అందువల్ల చేసేది లేక కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్, యానాది సంఘం మహా కూటమి జిల్లా ఇండ్ల రవి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రావాల్సిన జీతభత్యాలు చెల్లించాలి

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త : నెల్లూరు జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకి పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం సూదులగుంట షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి కార్మికులకు రావాల్సిన జీతభత్యాలు చెల్లించాలని వినతిపత్రం అందజేసిన న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలు గతంలో మూతపడినందున కార్మికులు ఉపాధి కోల్పోయి జీతభత్యాలు అందక తమ కుటుంబాలు అనేక అవస్థలు పడుతున్నారు అని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారులు సమస్యలను ఎక్కువగా భూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ జాయింట్ కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుంటున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూ సమస్యలు క్రింది స్థాయిలో పరిష్కారం కానందున అర్జీదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మీడియా ముఖంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాబురావు రమణయ్య, వెంకటసుబ్బయ్య, శేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అచ్చే దిన్ కాదు సచ్చే దిన్

- పెట్రో ధర మనదేశంలోనే అత్యధికం- హామీలు ఇవ్వడం కాదు అవి నెరవేర్చేలా పాలన సాగించాలి

- వైసిపి ఆధ్వర్యంలో నిరసన

ఆత్మకూరు,మే18,ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై ధరల భారం మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ,పదే పదే ప్రసంగాల్లో అచ్చేదిన్ అచ్చేదిన్ అంటూ చెప్పడం కాదు ఇలా ప్రతి విషయంలో ధరల భారంతో సచ్చే దిన్ వస్తున్నాయని, ప్రజలపై భారం మోపమంటూనే పోదుపు సలహాలు ఇస్తూ మోయలేని భారం మోపుతున్నారని ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి పేర్కొన్నారు.పెట్రోల్ , డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి నియోజకవర్గంలో పలు మండలాల వైఎస్ఆర్‌సిపి నాయకులతో కలసి సోమవారం ఆత్మకూరు ఆర్‌డిఓను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందుగా ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట పెట్రోల్ ,డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.ఆదిశేషయ్య, గంగవరపు శ్రీనివాసులునాయుడు , జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ పులిమి రమేష్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టి గెలిచి ఎన్నికల అనంతరం మోసం చేశారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆడినట్లుగా ప్రధాని ఆడుతున్నారని విమర్శించారు. దేశ ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా పెట్రోల్ వాడొద్దు, బంగారం కొనవద్దు అంటూ ప్రధాని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తమ వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో ధరలకు , ఇప్పటి ధరలకు వ్యత్యాసం ప్రజలే చూడాలని, ధరలు పెంచమని చెబుతూనే ప్రభుత్వం పెంచుకుంటూ పోతుందన్నారు. జగనన్న పాలనలో సంక్షేమం అందిస్తూనే ప్రజలపై ధరల భారం పడకుండా పాలన సాగించారన్నారు. మన రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయన్నారు. దీని ప్రభావంతో రవాణా, నిత్యావసర వస్తువుల ధరలపై భారం పడి ప్రజలకు మరింత ఇబ్బందిగా మారుతుందన్నారు. ఇకనైనా పెంచిన ధరలను తగ్గించాలని లేకుండా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు కూనం సుధాకర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, మర్రిపాడు వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ చెన్ను వెంకటేశ్వరరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు ఆండ్రా సుబ్బారెడ్డి, నెల్లూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి యాక్టివిటి సెక్రటరీ బట్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్ఆర్ టిఏ వింగ్ వైస్ ప్రెసిడెంట్ మెట్టుకూరు సుబ్బారెడ్డి, అనంతసాగరం మండల ఉపాధ్యక్షుడు అల్లంపాటి సుధాకర్‌రెడ్డి కామాక్షయ్యనాయుడు, ఇందూరు సురేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, వెంగళరెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులునాయుడు, గడ్డం శ్రీనివాసులురెడ్డి, రవికుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అశోక్ , మాల్యాద్రి, మస్తాన్, వెంకటరెడ్డి, గిరి, శ్రీనివాసులురెడ్డి, షారుక్ ,మాల్యాద్రి , నాగరాజు, మధు, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలోకి విదేశీ బోట్లు వస్తే సమాచారం ఇవ్వండి

కోట, మే 18 ప్రభాతవార్త: సముద్రంలోకి విదేశీ బోట్లు వస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని మెరైన్ సిఐ వెంకటేశ్వర్లురెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపట్నం గ్రామంలో మత్స్యకారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సముద్రంలో చేపల వేట నిషేధరో ఉందని, మత్స్యకారులెవరూ వేటకు సముద్రంలోకి వెళ్లకూడదన్నారు. అదేవిధంగా సముద్రం వెంబడి కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే 1093 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ శివసొమ్య, ఫారెస్ట్ ఎఎస్ఐ రవి, పంచాయతీ కార్యదర్శులు రామయ్య, గౌతమి, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు కోసం కలెక్టర్‌ను కలిసిన గిరిజనులు

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త : కోట పంచాయతీ పరిధిలోని దామరమడుగు గిరిజనులు 40 ఏళ్లుగా రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డును కొందరు రైతులు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. దీంతో గిరిజనులు పొలాల గట్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. గిరిజనులు తమ పిల్లలను వర్షాకాలంలో పాఠశాలలకు పంపాలంటే రెండు మూడు అడుగుల లోతు నీళ్లలో, బురదలో పంపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. మరోపక్క ఎక్కడ విషసర్పాల బారిన పడతారోనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డును ఆక్రమించిన రైతులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రోడ్డుకు ఇరువైపులా రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు చూపించాలని కలెక్టర్‌ను కోరారు. ఆ మేరకు కలెక్టర్ మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పినట్లు గిరిజనులు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌డేలో గిరిజనులు కలెక్టర్‌కు విన్నవించారు.

ఎన్‌బీకేఆర్ ఎన్‌సిసి ఆర్మీ విద్యార్థులకు అభినందనలు

ప్రిన్సిపల్.డా.ఎం.శ్రీనివాసులు

కోట,మే 18 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్మీ విభాగానికి చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు ఈ నెల 5 నుంచి 14 వరకు విట్ యూనివర్శిటి గంటూరు, నెల్లూరులోని అక్షర విద్యాలయంలో జరిగిన ఎన్‌సిసి శిబిరాలల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వివిధ పోటీల్లో విజేతలగా నిలిచి బహుమతులను అందుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎం.శ్రీనివాసులు ఆర్మీ అధికారి గోవిందు మాధవయ్య తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆ విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా ప్రినిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు ఎన్‌సిసిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ఉండటం చాల సంతోషంగా ఉందన్నారు.ఎన్‌సిసి శిక్షణ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు సామాజిక బాధ్యత పర్యావరణ అవగాహన లాంటి గొప్ప లక్షణాలు అలవాడుతాయన్నారు. తమ కళాశాలలో ఆర్మీ, నేవీ విభాగాలు చాల సమర్ధవంతంగా పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు.నూతనంగా ఇంజినీరింగ్ లో మొదటి సంవత్సరంలో చేరబోవు విద్యార్థులు ఇలాంటి సౌకర్యాలను చక్కగా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. వ్యాసరచన, ఆటలు,టెంట్ పిచ్చింగ్ ఫైరింగ్, వ్యక్తిత్వం వికాసం, వంటి పోటీల్లో గెలుపుపొందిన చాతుర్య, కె.సుస్మిత, భువనకృతి, పరిహన, సిరీన, పవిత్ర, వంశీ తదితర విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను అన్ని రకాలగా ప్రోత్సహిస్తున్న తమ కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి కి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సమస్య పరిష్కార వేదికలో 6 అర్జీలు

విడవలూరు,మే 18 ప్రభాతవార్త : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో మండల ప్రజలు పాల్గొని తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను తహశీల్దార్ కె. చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 6 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో భూ విస్తరణ, రెవెన్యూ రికార్డుల్లో వచ్చిన తప్పిదాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత, ఏఎస్ఓ శ్రీనివాసులు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని

కోరుతూ రూరల్ నియోజకవర్గంలో వైసీపీ నిరసన ధర్నా

నెల్లూరు అగ్రికల్చర్, మే 18, ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు కదం తొక్కారు. సోమవారం నెల్లూరులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ పార్టీ సమన్వయకర్త ఆనం విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల మీద భారం మోపిందన్నారు. వీటి ధరల పెరుగుదలతో నిత్యవసర సరుకుల ధరలు పెరిగి పేద మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తాయని వివరించారు. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోమని కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఇంధన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించి ప్రజలపై భారం మోపడం దారుణం అన్నారు. ధరల పెరుగుదల కారణంగా అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీంతో పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించేందుకు తమ సుంకాలను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం రూరల్ తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, డివిజన్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో రక్తపోటు నియంత్రణ

వింజమూరు, మే 18, ప్రభాతవార్త : నిశ్శబ్ద హంతకుడుగా పిలిచే అధిక రక్తపోటును కేవలం జీవనశైలి మార్పులతో అదుపులో ఉంచుకోవచ్చని వింజమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు గున్నం మధుమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా వింజమూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వచ్చిన రోగులకు ఉచితంగా రక్తపోటు పరీక్షలు నిర్వహించి నివారణ, నియంత్రణ మార్గాలపై అవగాహన కల్పించారు. హైపర్ టెన్షన్ అంటే రక్తపోటు సాధారణ స్థాయి 120/80 కంటే ఎక్కువగా ఉండటమేనని డాక్టర్ మధు వివరించారు. చాలా మంది ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించని అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అంటారని ఆయన తెలిపారు. అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు, పక్షవాతం కిడ్నీ జబ్బులు కంటిచూపు మందగించడం వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. అయితే 80శాతం కేసుల్లో జీవనశైలి మార్పులు క్రమమైన మందులతో పూర్తిగా అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. రక్తపోటు ఉన్న వారు రోజుకు ఐదు గ్రాములు మించి ఉప్పు తీసుకోకూడదు అన్నారు. ఊరగాయలు ప్యాకేజ్ ఫుడ్‌లో ఉప్పు ఎక్కువగా ఉంటుందని వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ప్రతి రోజు 30 నిమిషాల పాటు నడక సైక్లింగ్ యోగా వంటివి చేయాలన్నారు. దాంతో బరువును అదుపులో ఉంచడంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుందన్నారు. అలాగే తాజా కూరగాయలు, పండ్లు తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ వేపుళ్ళు అధిక నూనె క్రొవ్వు ఉన్న ఆహారాన్ని తగ్గించాలన్నారు. ధూమపానం మద్యపానం రక్తపోటును విపరీతంగా పెంచుతాయన్నారు. ఒత్తిడి రక్తపోటును పెంచుతుందని, కనుక ధాన్యం ప్రాణాయామం తగినంత నిద్ర ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవాలని డాక్టర్ సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో రక్తపోటు పరీక్షలు మందులు ఉచితంగా లభిస్తాయని ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, నర్సులు రోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు

: తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు, మే 18 ప్రభాతవార్త : మండల తహశీల్దారు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల అమ్మకాల కోసం ప్రత్యేక స్టాల్ను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేశారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలుదారులకు వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. రసాయన రహిత ఆహారం వినియోగించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఆర్ఐ హైమావతి, ప్రకృతి వ్యవసాయ ఎంటీ శ్రీకాంత్, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల్లో చికెన్ వ్యర్థాలు వేస్తే చర్యలు



కొడవలూరు, మే 18 ప్రభాతవార్త : మండలంలోని చేపల చెరువుల్లో చికెన్ వ్యర్థాలను మేతగా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని కొడవలూరు సర్కిల్ సీఐ ఓ. దుర్గాప్రసాద్రావు హెచ్చరించారు. ఆయన మాటాడుతూ విడవలూరు, కొడవలూరు మండల పరిధిలోని చేపల చెరువులకు ఇతర ప్రాంతాల నుంచి వాహనాలు, డ్రమ్ముల ద్వారా చికెన్ వ్యర్థాలను తీసుకువచ్చి చేపలకు మేతగా వేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇటీవల ఇలాంటి ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి, వ్యర్థాలను తరలిస్తున్న కొన్ని వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చేపల చెరువుల్లో చికెన్ వ్యర్థాలు వేయడం వల్ల తీవ్ర పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని, ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. చెరువుల్లో చికెన్ వ్యర్థాలు వేస్తున్న రైతులపై మాత్రమే కాకుండా, వాటిని రవాణా చేస్తున్న వారిపై, సహకరిస్తున్న వ్యక్తులపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యావరణానికి హాని కలిగించే కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అలాంటి సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని కొడవలూరు సర్కిల్ సీఐ ఓ. దుర్గాప్రసాద్రావు సూచించారు.

జీవో నెం. 322ను వెంటనే రద్దు చేయాలి

- జీవో ప్రతులను తగలపెట్టిన సొసైటీ ఉద్యోగులు



కోవూరు, మే18 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం సొసైటీ ఉద్యోగులకు కొత్తగా అమలు చేసిన జీవోలో న్యాయం జరగకపోగా అన్యాయం జరిగిందని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండూరు గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణంలో సోమవారం ప్రభుత్వం ఇచ్చిన 322 జీవో ప్రతులను తగలపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ జీవో తక్షణమే రద్దు చేసి మరో జీవోను అమలు చేయాలన్నారు. ఈ జీవోలో ఉద్యోగులకు అన్యాయం జరిగిందంటూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జీవో కరపత్రాలను తగలపెట్టడం జరిగిందన్నారు. కొన్ని నెలలుగా ఉద్యోగుల సమస్యలపై నిరాహార దీక్షలు చేసినా సరైన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షలను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత మంత్రి తూతూ మంత్రంగా సొసైటీ ఉద్యోగులకు 322 జీవోను అమలు పరచడం జరిగిందన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరగకపోతే తాము చేస్తున్న కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామానాయుడు, ఉపాధ్యక్షుడు సపోమవరపు సురేష్‌కుమార్‌రెడ్డి, సొసైటీ ఉద్యోగులు ఉన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్త్

– 858 మంది పోలీసులతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు – జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల

నెల్లూరు క్రైం, మే 18, ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 19న ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించనున్న మత్స్యకార భరోసా కార్యక్రమానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్న నేపథ్యంలో, జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లపై సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. వీవీఐపీ కాన్వాయ్ సురక్షిత ప్రయాణం కోసం రూట్ బందోబస్తును ముమ్మరం చేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహకారంతో యాంటీ సబోటేజ్ తనిఖీలు, రోడ్ ఓపెనింగ్ పార్టీ తనిఖీలు, కీలక ప్రాంతాల్లో కూంబింగ్ చర్యలను క్షుణ్ణంగా నిర్వహించనున్నారు. సభకు వచ్చే వాహనాలు, ప్రజా రవాణాకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక వాహనాల పార్కింగ్ నియంత్రణలపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్యూటీకి హాజరయ్యే ప్రతి ఒక్కరూ పూర్తి యూనిఫారంలో, ఐడీ కార్డులతో సమయపాలన పాటిస్తూ కేటాయించిన పాయింట్లలో పూర్తి అప్రమత్తతతో ఉండాలి. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాముఖ్యత కలిగింది . ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి బందోబస్తును విజయవంతం చేయాలన్నారు. ఈ పర్యటన నిమిత్తం మొత్తం 858 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన కోటలాంటి భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమగ్ర బ్రీఫింగ్ కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి. (అడ్మిన్) సి.హెచ్. సౌజన్య, ఎస్ఎస్‌జి అడిషనల్ ఎస్పి మల్లికార్జున రావు, ఎస్ఎస్‌జి డిఎస్పీ రాము, కావలి డిఎస్పివి రమణ కుమార్, రూరల్ డిఎస్పి జి. శ్రీనివాస రావు, ఆత్మకూరు డిఎస్.పి వేణుగోపాల్, ఎస్‌బి డిఎస్పి ధీరజ్, ఏఆర్ డిఎస్పి చంద్రమోహన్‌లతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

– జిల్లా ఎస్పి డా. అజిత వేజెండ్ల

నెల్లూరు క్రైం, మే 18, ప్రభాతవార్త: ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిం చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పిఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 160 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని, బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కోవూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళ, తాను ప్రస్తుతం గర్భవతినని, తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని, గర్భవతిననే కనికరం లేకుండా మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని ఫిర్యాదు చేస్తూ విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కొడవలూరు పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మహిళ, ముత్తుకూరుకు చెందిన దొంపల నాగేంద్ర అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో సన్నిహితంగా ఉండి ఆర్థికంగా నష్టపరిచి, ప్రస్తుతం పెళ్లి చేసుకోనని అవమానకరంగా మాట్లాడుతున్నాడని ఫిర్యాదు చేశారు. నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మహిళ, తన కుమార్తె ఈ నెల 2వ తేదీ నుండి కనిపించడం లేదని, ఈ విషయమై నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు, విచారించి, తన కుమార్తెను ఆచూకీ గుర్తించి అప్పగించాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పి అడ్మిన్ సిహెచ్ సౌజన్య, మహిళా పోలీస్ స్టేషన్ సి.ఐ. సుబ్బారావు, డిసిఆర్‌బి సీఐ రామారావు, ఎస్‌బి 2 సిఐ శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం

ఇందుకూరుపేట, మే 18, ప్రభాతవార్త : ఇందుకూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ అసంక్రమిత వ్యాధుల అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఉచిత వైద్యపరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సునీల్ మాట్లా డుతూ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా సమాజంలో అసంక్రమిత వ్యాధులు, వేగంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అధిక రక్తపోటు(బీపీ), డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధుల భారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 40 ఏళ్లు పైబడిన వారు తప్పనిసరిగా ఏటా కనీసం ఒక్క సారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వీటిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సులభంగా అదుపులో ఉంచవచ్చనిఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు, స్థానికులకు బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తు ఆహ్వానం

ఉదయగిరి, మే 18, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలో ఆన్‌కాల్ పద్ధతిలో ఉద్యోగం చేసేందుకు ఆసక్తి గల హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ డీఎం ఈ రమేష్ కుమార్ తెలిపారు. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తి అయిన వారు అర్హులన్నారు. అవసరమైనప్పుడు డ్యూటీకి పిలుస్తామన్నారు. అర్హత ఉంది ఆసక్తి కలిగిన డ్రైవర్లు ఈనెల 20వ తేదీ లోగా డిపోలో దరఖాస్తు అందజేయాలన్నారు.

రొయ్యల గుంటల కోసం పంట కాలువలు

– పూడ్చి వేయడంతో రైతుల ఆందోళన

మనుబోలు మే 18 ప్రభాతవార్త : ప్రభుత్వ భూముల రొయ్యల సాగుతో 1000 మంది రైతుల పరిస్థితి ప్రశ్నార్ధకంగా మారింది. అడిగే వారు లేరన్న ధీమాతో అధికారుల సపోర్టుతో మనుబోలు మండలం పిడూరుపాళెం గ్రామ సర్వే నెంబర్ 81,82,83,84లో 150 ఎకరాల సిజెఎఫ్ఎస్ భూమిలో రొయ్యల సాగు చేసున్నాడని దీనివల్ల తామంతా ఇబ్బంది పడుతామని నాలుగు గ్రామాలకు చెందిన రైతులు సోమవారం తహశిల్దారు వి వినతి పత్రాన్ని అందజేశారు. బద్దెవోలు చెందిన బత్తల వెంకటరమణయ్య 150 ఎకరాల సిజెఎఫ్ఎస్ భూమిని కొనుగోలు చేశాడు. అందులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రొయ్యలసాగు కోసం గుంటలు తీస్తున్నాడు. ఈవిషయం తెలుసుకున్న పిడూరు గ్రామ దళితులు ఆదివారం రాత్రి అడ్డుకున్నారు. మద్యం సేవించి కులం పేరుతో దూషిస్తు దౌర్జన్యం చేశారని వారు తెలిపారు. రొయ్యల గుంటల కోసం పంటకాలువలను పూడ్చి వేసారని వారు తెలిపారు. వాగులు వంకలతోపాటు డొంకలను అక్రమించడంతో దారి లేక 6 వందల ఎకరాల్లో సాగు ఏలా చేయాలో అని రైతులు ప్రశ్నించారు. ఈరొయ్యల కాలుష్యవల్ల మనుబోలు పిడూరుపాలెం, లక్ష్మీనరసింహపురం గ్రామాల చెందిన రైతులు పెద్దఎత్తున నష్టపోతున్నామని తెలిపారు. ఈరొయ్యల గుంటలో సాగును నిలిపివేయాలని లేనిచో రైతులు సామూహికంగా ఆత్మహత్యలకు పాల్పడతామని వారు హెచ్చరించారు.

బీపీ, షుగర్‌లపై అవగాహన

కావలి, మే 18 ప్రభాతవార్త : కావలి ఏరియా వైద్యశాలలో ఏపి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 2026కు సంబంధించి అసంక్రమిత వ్యాదుల నియంత్రణ ,నివారణ కార్యక్రమంలో భాగంగా మీ ఆరోగ్యం మీ చేతుల్లో బాధ్యత మీది భరోస మాది అనే నినాదంతో వైద్యశాల మెడికల్ సూపరిండెంట్ ఉషబాల, ఆర్ఎంఓ డాక్టర్ ప్రమీల పర్యవేక్షణలో బిపి ,షుగరలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సూచనలు, సలహాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దీర్ఘకాలిక వ్యాధులను ఎప్పటికప్పుడు చెక్ చేయించుకోవాలని తెలిపారు. ఎక్కువగా ఉన్నయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ పెంపుపై వైసీపీ నిరసన

ఉదయగిరి, మే18, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉదయగిరి పెట్రోల్ బంకు దగ్గర నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలపై వినూత్నంగా ఎద్దల బండిపై ఊరేగింపుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ అనంతరం ఈ సందర్భంగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగనన్న పిలుపు మేరకు పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపును నిరసిస్తూ ఉదయగిరినియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలో ఎద్దల బండి నడుపుతూ వినూత్న నిరసన తెలియజేసిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి. నిరసన కార్యక్రమంకి వందలాదిగా పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలీ అనంతరం స్థానిక తహసీల్దార్‌కి నాయకులు కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేసిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి. ఈ సందర్భంగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. నాడు జగనన్న ప్రభుత్వంలో పెట్రోల్, డీజిల్ ధరలు అరకొరగా పెరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు , ఆయన తనయుడు లోకేష్, దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్‌లు నానా యాగి చేసి తాము అధికారంలోకి రాగానే తగ్గిస్తామని తెలిపారు. అయితే నేడు అధికారంలోకి రాగానే ఆ హామీ గాలికి వదిలేసి 10 రూపాయలు కి పైగా రేట్లు పెంచడం సామాన్యుని నడ్డి విరచడమే అన్నారు. పెట్రోల్, డీజిల్‌తో సహా నిత్యవసర సరుకులు ధరలు పెంచి సామాన్య ప్రజలను ఈ కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రధాని మోడీ పొదుపు మంత్రాన్ని స్వాగతిస్తున్నామని మన రాష్ట్రంలో మాత్రం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు దర్జాగా స్పెషల్ ఫ్లైట్లలో వారం వారం తిరుగుతూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ఈ సందర్భంగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే నియంత్రణలోకి తీసుకుని రావాలని లేని పక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని రాజగోపాల్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కొడవలూరు, మే 18 ప్రభాతవార్త : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. వచ్చిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖ అధికారులకు బదిలీ చేసి, పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం విఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఏఎస్ఓ గాయత్రి, ఆర్ఐ హైమావతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగభూషణమ్మ, ఏపీఎం కృష్ణవేణి, ఎంఈఓ వసంతకుమారి, విఆర్వోలు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సరైన ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలి

కోవూరు, మే18 ప్రభాతవార్త : కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమవారం సదరంకు వచ్చే రోగులు వారి దగ్గర ఉన్న నిర్ణీత ధృవీకరణ పత్రాలతో తప్పక హాజరు కావాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 24 మంది రోగులకు సదరం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఈ సదరంకు వచ్చే వారు నిర్ణీత ధృవీకరణ పత్రాలతో హాజరుకాకపోతే పరీక్షలు నిర్వహించేందుకు వీలు కాదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వారి దగ్గర ఉన్న ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

మరింత అవగాహన పెంచాలి

కోవూరు, మే18 ప్రభాతవార్త : కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వీవోఏలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుబ్బరాజు మాట్లాడుతూ వీవోఏలు వారి వారి పరిధిలో ఉన్న పొదుపు గ్రూపులకు బ్యాం కుల ద్వారా తీసుకున్న రుణాలపై మరింత అవగా హన కల్పించి స్వయం ఉపాధి రంగాలపై వారు దృష్టి సారించేలా తగు చొరవ తీసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, రికార్డు నిర్వ హణ పారదర్శకంగా ఉండేలా వారిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వీవోఏల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో సీసీలు రాము, శోభ, తదితరులు ఉన్నారు.

పెట్రోల్ డీజిల్ ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి

వెంకటాచలం మే 18 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్లో డీజిల్ పెట్రోల్ ధరలు సామాన్యుడిపై మోయలేని భారం పడిందని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో సోమవారం పెట్రోల్ డీజిల్ ధరలపై ఎడ్ల బండి పై నిరసన కార్యక్రమం చేపట్టారు. సర్వేపల్లి రోడ్డు వద్ద నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఇంచార్జ్ తాసిల్దారు విజయ్ కి వినత పత్రం అందజేశారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విజనరీ నాయకుడు అని చంద్రబాబు నాయుడు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఒకే విడతలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై 3,391 కోట్ల భారాన్ని మోపిందన్నారు. 2024 ఎన్నికల ముందు లోకేష్ పెట్రోల్ బంకులు వద్దకు వెళ్లి సెల్ఫీ దిగి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. ధరల పెంపు పేద మధ్యతరగతి సామాన్లపై ఎక్కువగా పడుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ఆలోచన విధానం అంతా పేద మధ్యతరగతి ప్రజలపై భారం మోపే విధంగా ఉందన్నారు. మొత్తం వ్యవస్థ అంతా అవినీతిమయంగా మారిందన్నారు. గతంలో ఉక్రిన్ వ్యక్తం కరోనా వంటి సమయాల్లో కూడా పేదలపై భారం పడకుండా జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేశారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకు వీర చలపతి జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు ఎం వెంకట శేషయ్య, మండల కన్వీనర్ మోహన్ నాయుడు, మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

కావలి, మే 18 ప్రభాతవార్త : ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వస్థలాలను కాపాడి ప్రభుత్వం వెంటనే స్వాదీనం చేసు కోవాలని వామపక్ష పార్టీలు సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం ఇచ్చారు. వామపక్ష నేతలు మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ లకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలకు గురైన ప్రతి స్థలంలో బారీ నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ మున్సిపల్ అధికారులు ప్రభుత్వ స్థలాలు అమ్ముకొంటున్నారని ఆరోపించారు. కుంటలు, కలుజు, కాలువలు, ఒరవ, మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయని తెలిపారు. దీనిపై మున్సిపల్ అదికారులకు తెలిపితే పట్టించుకోవడం లేదని ఆ ఆక్రమణల స్థలాల వెనుక పెద్దలు ఉన్నారని చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ వెనుక ఉన్న ఆ పెద్దలు ఎవరో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ముసునూరు అయ్యప్ప దేవస్థానం పక్కన కోట్లు విలువ చేసే స్థలంలో నిర్మాణాలు జరుగుతు న్నాయని శివాలయం వద్ద 100అంకణాల దోభిఘాట్ స్థలం, వెంకయ్యగారిపాలెం వద్ద పంట కాలువను ఆక్రమించి మూడుంస్తుల నిర్మాణాలు జరిగాయని వీటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలే దని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణల్లో కానీ, గ్రావెల్ మాఫియాలో గాని అక్రమ రియల్ ఏస్టేట్ వ్యాపా రంలో గత పాలనను మించి జరుగుతుందని అన్నారు. ఈ ధర్నా సిపిఎం పట్టణ కార్యదర్శి పుసుపులేటి పెంచలయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, న్యాయవాది కరవది భాస్కర్, సిపిఐ ఎంఎల్ నాయకులు ఎల్.లక్ష్మిరెడ్డి, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఎల్.శ్యామల, పి.బోసు, కె.మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్యాడెట్ ఆస్మాకు అభినందనలు

కావలి, మే 18 ప్రభాతవార్త : కావలి వెంగళరావు నగర్ శ్రీ పొట్టిశ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థిని క్యాడెట్ ఆస్మా ఈనెల 6నుండి 15వరకు తమిళనాడు రాష్ట్రంలోని నీలగిరి కొండల్లో ట్రెక్కింగ్ క్యాంపు విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈక్యాంపుద్వారా ఆస్మా పాఠశాలకు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకువచ్చిందని ఇతర విద్యార్థులు కూడా ఆదర్శంగా తీసుకొని కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. క్యాడెట్ ఆస్మా మాట్లాడుతూ ముందుగా ఈ అవకాశం కల్పించిన 10 ఆంధ్ర నావెల్ యూనిట్‌కు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్‌గోదంగేనకు ధన్యవాదాలు తెలిపారు. ఏఎన్ఓ సెకండ్ ఆఫీసర్ కొండారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎన్ఓ సెకండ్ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ ఆస్మా వరుసగా రెండు క్యాంపులు చేసిందని అందులో ఏప్రిల్ 25నుంచి మే 4వరకు వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో వార్షిక శిక్షణ శిబిరాన్ని పూర్తి చేసుకొని మే 6నుంచి 15వరకు ఊటి కొండల్లో ట్రెక్కింగ్ క్యాంపు చేసిందని ఇదిచాలా అభినందించాల్సిన విషయం అన్నారు. భవిష్యత్తులో ఇంకా ఈ పాఠశాల నుంచి అనేకమంది అనేక రకాల క్యాంపులకు ఎంపిక కాబడి యూనిట్‌కి పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్మా తల్లిదండ్రులు, క్యాడెట్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - కొరుటూరు

ఇందుకూరు పేట మం॥, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆర్.ఓ.సి.నెం.04/05/2026 తేది: 18.05.2026

టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట మండలం, కొరుటూరు గ్రామపంచాయతీ ఏరియాలో 2026-2027 సం॥నకు గాను తేది. 01.04.2026 నుండి 31.03.2027 వరకు గ్రామ పంచాయితీ నందు వివిధ సేవలు నిర్వహించుటకు దండోరా మూలముగా టెండరు దాఖలు చేయవలెనని తేది. 04.05.2026న తెలియపరచడమైనది. సదరు సేవల మీద సిబ్బందిని పంపుటకు ఆసక్తి ఉన్న కాంట్రాక్టుకు గ్రామ పంచాయితీ నందు టెండర్ దాఖలు చేయవలెను సదరు టెండర్ దాఖలు తేది. 24.05.2026 ఉదయం 10.00 గం॥ నుండి మధ్యాహ్నం 3.00 గం॥వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గం॥లకు హాజరైన టెండరు దారుల సమక్షం నందు సీల్డు టెండర్లు తెరువబడును. దాఖలు చేయువారు ఈ క్రింది తెలిపిన విధముగా నిర్ణీత ధరావత్తు పంచాయితీ కార్యాలయములో చెల్లించి తగు రశీదు పొంది, టెండరును జతపరిచి టెండరు దాఖలు చేయవలెను. మిగిలిన నింబంధనలు మరియు వివరములు కార్యాలయ పనివేళలందు వచ్చి తెలుసుకొనవచ్చును. గ్రామ పంచాయితీకి సిబ్బందికి ప్రతిరోజు పంపవలెను. షరతులు వర్తించును పై టెండర్లు ఆమోదం తెలుపుటకు తుది నిర్ణయం పంచాయితీ వారిది టెండరు తేదీన ప్రభుత్వం వారు సెలవుగా ప్రకటించిన యెడల మరుసటి కార్యాలయం పనివేళలో స్వీకరించబడును.

వ. నెం.	టెండర్ వివరములు (తేది 01.04.2026 నుండి 31.03.2027 వరకు పనిచేయుటకు)	టెండర్ ధరావత్తు
1	పంపు ఆపరేటర్లు-01, స్వీపర్లు-3, గుమస్తా-1, ఎలక్ట్రీషియన్-1, డ్రైవర్-1	రూ.500

సం/- శివజ్యోతి, పంచాయితీ కార్యదర్శి,
కొరుటూరు గ్రామ పంచాయితీ, ఇందుకూరుపేట మండలం.

కావలి డిపో మార్పుతో అలగానిపాడు ప్రజలకు బస్సు కష్టాలు కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి

నెల్లూరు కలెక్టరేట్, మే 18, ప్రభాతవార్త : అలగానిపాడు మరియు పరిసర గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను నెల్లూరు డిపో నుంచి కావలి డిపోకు మార్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అలగానిపాడు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు .గ్రామా నికి సమీపంలో ఉన్న నెల్లూరు డిపో స్థానంలో దూరంలోని కావలి డిపో నుంచి బస్సులు నడపడం వల్ల సమయపాలన పూర్తిగా దెబ్బతింటోందని గ్రామస్తులు తెలిపారు. ఉదయం రావాల్సిన బస్సులు ఆలస్యంగా వస్తుండటంతో ఉద్యోగులు కార్యాలయాలకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొన్ని ట్రిప్పులు రద్దవుతు న్నాయని, బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రజలు అధిక చార్జీలు చెల్లించి ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలగానిపాడు, వీరారెడ్డి పాలెం, అన్నారెడ్డి పాలెం, పార్లపల్లి, విడవలూరు గ్రామాల ప్రజలు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే స్పందించి అలగానిపాడు రూట్ బస్సులను తిరిగి నెల్లూరు డిపో1కు కేటాయించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు.

పెట్రోల్ డీజల్ ధరల పెంపుపై వైసిపి నాయకులు నిరసన

కావలి, మే 18 ప్రభాతవార్త : పెట్రోల్ డీజల్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ వైసిపి అధినేత, మాజీముఖ్యమంరతి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సూచనల మేరకు స్థానిక వైసిపి నేతలు సోమవారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టి స్థానిక ఆర్డీఓ కార్యాలయ డిఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ ఇటీవల పెంచిన పెట్రోల్, డీజల్ ధరలు సామాన్య ప్రజలపై ఆర్థికభారాన్ని మోపుతోందని తెలిపారు. నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు, రవాణా చార్జీలు పెరిగాయన్నారు. ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజల్ ధరలను తగ్గించాలని ఇందనాలపై విదిస్తున్న అదనపు పన్నులను పునఃసక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ప్రజల తరపున విస్తృతస్థాయిలో ఆందోలనలు చేపడుతామని హచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి కావలి నియోజకవర్గంలోని పట్టణ, మండల కన్వీనర్లు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం అక్రమంగా తరిలించేవారిపై చర్యలు తీసుకోవాలి

కావలి, మే 18 ప్రభాతవార్త : రేషన్‌బియ్యం అక్రమంగా తరలించేవారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో ఆర్డీఓ కార్యాలయం వద్ద దర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓ కార్యాలయ డిఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా అక్రమంగా తరలించేవారిపై రెవెన్యూ అధికారులు చిన్న చిన్న కేసులు పెటిట అధికార పార్టీ అండదండలతో వదిలిపెడుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బియ్యంను పేద వర్గాల వారికి ఆశచూపి బియ్యంను సేకరించి మండలానికి రెండు లారీలచొప్పున రైస్ మిల్లులకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా రైస్‌మిల్లర్లు కొందరు కోట్లాది రుపాయలు గడిస్తున్నారని తెలిపారు. ఇటీవల జలదంకిలో ఓ రైస్‌మిల్ వద్ద రేషన్ బియ్యం పట్టుబడి ప్రభుత్వం కేసులు పెట్టి ఎటువంటి సమాదానం లేకుండా ఉంటున్నారని తెలిపారు. ఇలాంటి అక్రమంగా తరలించేవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయర్నం, మోహన్‌రావు, దయాకర్, మారుబోయిన భాస్కర్, లక్ష్మి నరసయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బర్త్‌డే కానుకగా వీపీఆర్ నేత్ర బస్సు

విడవలూరు, మే 18 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని వీపీఆర్ ఫౌండేషన్ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా రూపుదిద్దుకున్న అధునాతన వీపీఆర్ నేత్ర బస్సు ద్వారా విడవలూరు మండలంలో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరాలు విజయవంతంగా ముగిశాయి. ఈమేరకు వీపీఆర్ ఫౌండేషన్ ప్రధాన సమన్వయకర్త, నేత్ర శిబిరాల బాధ్యులు ఎన్. శంకర్ వివరాలను వెల్లడించారు. గత నెల ఏప్రిల్ 20వ తేదీన చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా విడవ లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో వీపీఆర్ నేత్ర బస్సు సేవ లను ప్రారంభించారు. మండలం వ్యాప్తంగా మొత్తం 15 పంచాయ తీల్లో 22 రోజుల పాటు నిరంతరాయంగా నిర్వహించిన ఈ శిబిరా లు, ఈ నెల 15వ తేదీన విడవలూరు మండల కేంద్రంలో విజయ వంతంగా ముగిశాయి. ఈ 22 రోజుల వ్యవధిలో వీపీఆర్ నేత్ర బస్సు ద్వారా అందించిన వైద్య సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరాల వారీగా గణాంకాలు ఇలా ఉన్నాయి:మొత్తం పరీక్షలు చేయిం చుకున్న బాహ్య రోగుల సంఖ్య : 7,273 ఉచితంగా కళ్లద్దాలు పొందిన లబ్ధిదారుల సంఖ్య : 4,273 మొత్తం రోగుల్లో అద్దాలు పంపిణీ చేసినశాతం : 65 గ్రామీణ ప్రాంతాల్లోని వేలాది మంది పేద ప్రజల చెంతకే అధునాతన నేత్ర బస్సును పంపించి, ఉచితంగా నాణ్యమైన కంటి పరీక్షలు నిర్వహిం చడమే కాకుండా మందులు, కళ్లద్దాలను పంపిణీ చేయడం విశేషం. పేద ప్రజల పట్ల వీపీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు మరువలేనివని, తమ కంటి వెలుగుకు కారణమైన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మె ల్యే ప్రశాం తి రెడ్డిలకు మండల ప్రజలు, లబ్ధిదారులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నేటి నుంచి కొడవ లూరు మండలంలో వీపీఆర్ నేత్ర బస్సు యాత్ర ప్రారంభం కానున్నట్లు ఎన్.శంకర్ తెలిపారు. కొడవ లూరు మండలం ఆలూరుపాడు గ్రామం నుంచి ఈ నేత్ర బస్సు ద్వారా ఉచిత శిబిరాలు ప్రారంభం కానున్నాయని, పరిసర ప్రాంతాల ప్రజలు, చేతివృత్తులవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరో నెల రోజుల్లో ములుమూడి కలుజు బ్రిడ్జి ప్రారంభోత్సవం

నెల్లూరు అగ్రికల్చర్, మే18, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయ న నియోజకవర్గ పరిధిలోని ములుమూడి కలుజు బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరువతో ములుమూడి కలుజు మీద శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత 30 ఏళ్లగా ఈ కలుజుపై రాకపోకలు సాగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక పరిష్కార మార్గం చూపామని చెప్పారు. మరో నెల రోజుల్లో ములుమూడి కలుజును ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుండా కరుణాకర్, మండల కోఆప్షన్ సభ్యులు మొహిద్దీన్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మద్దిపాటిని సత్కరించిన ఎమ్మెల్యే

కావలి, మే 18 ప్రభాతవార్త : గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు నెల్లూరుజోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంటకరాజు సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నివాసానికి విచ్చేసి ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను మద్దిపాటికి పరిచయం చేశారు. ఇద్దరుఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధి పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాల నిర్వహణపై చర్చించినట్లుసమాచారం. ఈకార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి తటపర్తిరమేష్ టిడిపినాయకులు రాంప్రసాద్ గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు, తుమ్మల వెంకటక్రిష్ణ, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజా సమస్యలపై వినతులు స్వీకరణ

గూడూరు, మే 18, ప్రభాతవార్త ప్రజా సమస్యలు పరిష్కారంలో భాగంగా గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు గ్రీవెన్స్ డే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొని వినతులు స్వీకరించారు. అనంతరం సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ

బుచ్చి మే 18 ప్రభాతవార్త గ్రీవెన్స్‌డే సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీప్రజల నుండి పలు అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ మాట్లాడుతు తన దృష్టికి వచ్చిన వెంటనే సమస్యను అదికారుల ద్వారా పరిష్కరిస్తామని అన్నారు. వీలైనంత త్వరాగా పరిష్కరిస్తామని అన్నారు. ఇక్కడ పరిష్కారం కాని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కరిస్తామని తెలిపారు.ప్రజలు గ్రీవెన్స్‌డేని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈకా ర్యక్రమంలో కమీషనర్ చిన్నబాబు,వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ కత్తి శ్రీదేవి పాల్గొన్నారు.

ఇనాం అబాలిస్ భూములకు పట్టాలు ఇవ్వాలి

సైదాపురం, మే 18, ప్రభాతవార్త సైదాపురం మండలంలో ఇనాం అబాలిస్ భూములకు సంబంధించి రైతులకు ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని అలాగే సైదాపురం, దేగపూడి డబల్ రోడ్డు పనులను పటిష్టంగా చేపట్టాలని మండల జనసేన పార్టీ నాయకులు, సీహెచ్ రవీంద్రనాథ్, గునసాని శ్రీనివాసులు, ఎనికంచలపతి, ఊస ప్రసన్నకుమార్‌లు తహసీల్దార్ సుభద్రకు ఎంపీడీవో రామ్మోహన్‌రెడ్డికి గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీహెచ్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన భరోసాతో పార్టీలో సరికొత్త ఆశలు చిగురించాయని, కూటమితో కలిసి మండల అభివృద్ధికి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. మండలంలో ఉన్న ప్రజా సమస్యలు, త్వరితగతిన పరిష్కారం చేయాలని అధికారులను కోరడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా రాగనరామాపురంలో విద్యుత్ దీపాలు, స్థానిక ఎస్సీ కాలనీలో నీటి సరఫరా సమస్యలపై అధికారులతో సూచించడం జరిగిందని తెలిపారు. జనసేన పార్టీ నాయకులు అడసనపల్లి భార్గవ్, అబ్దుల్ రెహమాన్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన అవసరం

కోవూరు, మే18 ప్రభాతవార్త : ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రక్తపోటు రోగులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డీఎల్ సురేష్ మాట్లాడుతూ రక్తపోటుకు సంబంధించి కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సకాలంలో వైద్యసేవలు అందించడమే కాకుండా అవసరమైన మందులు కూడా ఉన్నాయన్నారు. ప్రధానంగా రక్తపోటు వచ్చినప్పుడు దానికి సంబంధించి ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ఈ సందర్భంగా ఆయన రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సలావుద్దీన్, హెడ్ నర్సు ప్రసూనలత, తదితరులు ఉన్నారు.

కొల్లారెడ్డి సోదరుల సేవలు స్ఫూర్తిదాయకం

కోవూరు, మే18 ప్రభాతవార్త : మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీకి సోమవారం వాటర్ రిఫ్రి జిరేటర్లను కోవూరు టీడీపీ మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఇనమడుగుఎంపీటీసీ సభ్యుడుకొల్లారెడ్డి సునీల్‌రెడ్డిలు తమ సొంత నిధులతో వాటర్ రిఫ్రిజిరేటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఇనమడుగు టీడీపీ నాయకుడుచింతలపూడి పెంచలయ్య మాట్లాడుతూ ఇనమడుగు గ్రామంలో కొల్లారెడ్డి బ్రదర్స్ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారన్నారు. వివిధ రకాల సమ స్యలపై ప్రజలు పంచాయతీకి వస్తే ఈ ఎండల్లో దాహార్తిని తీర్చుకునేందుకు ఇబ్బంది పడకుండా వీటిని అందజేయ డం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా ఇటీవల ఇనమడుగు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్‌ను పూర్తిగా మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. పేద బడుగు, బలహీన వర్గాల వారు ఎవరైనా మృతిచెందితే వారి మట్టి ఖర్చులకు కూడా ఆర్థిక సాయం అందించడంలో కొల్లారెడ్డి సోదరులు ముందుంటారని కొనియాడారు. ఈ సందర్భంగా కొల్లారెడ్డి సోదరులనుశాలువా,పుష్ప గుచ్ఛంతో సత్కరించారు.మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెల గపూడి శ్రీనివాసులు, కోవూరు మండల టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌కే సుభాన్, పంచాయతీ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

డయల్ యువర్ ఎస్.ఈ. కార్యక్రమానికి 12 ఫిర్యాదులు

నెల్లూరు, మే 18, ప్రభాతవార్త-వైద్యం సోమవారం విద్యుత్ భవన్, నెల్లూరు నందు నిర్వహించిన డయల్ యువర్ ఎస్.ఈ." కార్యక్రమానికి జిల్లాలోని వివిధ డివిజన్ల నుండి మొత్తం 12 ఫిర్యాదులు అంది నట్లు జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం తెలిపారు.ఈ ఫిర్యా దులు ముఖ్యంగా విద్యుత్ అంతరాయం, లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ పోల్స్ ఏర్పాటు తదితర అంశాలకు సంబం ధించి నవిగా ఉన్నాయని తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం"డయల్ యువర్ ఎస్.ఈ." కార్యక్రమం నిర్వహించబడుతున్నదని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు జూన్ 1 నుంచి అమలులోకి నెల్లూరు జిల్లాలోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ సంస్థ చర్యలు చేపడుతోంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, లక్ష్యంవాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ వినియోగం,బిల్లింగ్‌లో పారదర్శకత పెంపొందించేందుకు ఈ స్మార్ట్ మీటర్లను ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రీపెయిడ్ విధానం ద్వారా విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవడం, విద్యుత్ పొదుపు చేయడం, బిల్లులను నియంత్రించుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారుల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుందని వివరించారు.ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఈ విధానాన్ని అమలులోకి తీసుకురానున్నారు. నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు/మున్సిపాలిటీలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితరాలకు సంబంధించిన మొత్తం 17,067 సర్వీసులు ఈ ప్రీపెయిడ్ విధానంలోకి మారనున్నాయి.ఈ సర్వీసులన్నింటినీ గ్రూపులుగా విభజించి, ఈవాలెట్ ద్వారా రీచార్జ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతినెలా విద్యుత్ చార్జీలు, స్థిర చార్జీలకు సంబంధించిన అడ్వాన్స్ మొత్తాన్ని సంబంధిత శాఖలు చెల్లించాల్సి ఉంటుంది.రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (APERC) ఆమోదించిన యూనిట్ ధరల ప్రకారం రోజువారీ విద్యుత్ వినియోగ చార్జీలు బ్యాలెన్స్ నుంచి మినహాయించబడతాయి. బ్యాలెన్స్ కనిష్ట స్థాయికి చేరినపుడు సంబంధిత అధికారులకు SMS/E-mail ద్వారా సమాచారం అందించబడుతుంది. బ్యాలెన్స్ సున్నాకు చేరినపుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే ప్రీపెయిడ్ మీటర్లుప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగంపై జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను అమలు చేస్తున్నామని ఎస్.ఈ. శ్రీ కె. రాఘవేంద్రం గారు తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ వినియోగంలో పారదర్శకత పెంపొందించడంతో పాటు విద్యుత్ బిల్లుల నియంత్రణకు ఈ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు. మొబైల్ రీచార్జ్ తరహాలోనే ఈవాలెట్ ద్వారా ప్రీపెయిడ్ మీటర్లను రీచార్జ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (కమర్షియల్) మునీంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దువ్వూరు కాలువ, డిబి చానల్‌కు సాగునీరు విడుదల

సంగం మే 18 ప్రభాతవార్త సంగం మండలంలోని దువ్వూరు కాలువ, డిబిచానల్ కాలువలకు ఇరిగేషన్ ఏఇ వినయ్‌కుమార్ టిడిపి మండలా ధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి దువ్వూరు కాలువ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం సాగునీరు విడుదల చేశారు.ఈ సందర్భంగా టిడిపి అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. మంత్రి ఆదేశాలతో 6 కోట్ల రూపాయాలతో మండలంలో కాలువల అభివృద్ధి జరుగుతున్నాయని అన్నారు.రైతులందరు పొదుపుగా సాగునీరు వాడలని, మంచి దిగుబడి సాధించాలని ఆయనకాంక్షించారు.

జొన్నవాడ కామాక్షితాయి హుండి లెక్కింపు

బుచ్చి మే 18 ప్రభాతవార్త ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లి కార్జునస్వామి కామాక్షితాయి హుండి లెక్కింపు సోమవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ,ధర్మాదాయశాఖ అధికారులు, ఆలయ చైర్మన్ పాలక మండలి సభ్యులు దేవస్థానం సహాయ కమీషనర్ కార్యనిర్వహణాధికారి సమక్షంలో హుండిలు తెరిచి లెక్కించారు. 25.03.26 నుండి 17.05.2026 వరకు అనగా 54 రోజులకు శ్రీవార్ల ప్రధాన ఆలయ హుండి ద్వారా ఆదాయం 34,80, 108 రూపాయలు రాగా3,కెనడియన్ డాలర్ 1,కువైట్ దినార్స్ 0.5 ,ఒమెన్‌రి యాల్ 7, బంగారు వస్తువులు 30 గ్రాము లు 500 మిల్లీ గ్రాములు,వెండి వస్తువులు 140 గ్రాములు ,అన్నప్రసాద హుండి ద్వారా 1,29,600 భక్తులు శ్రీవార్ల హుండి ద్వారా సమర్పించినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రహ్మోత్సవ చీఫ్ పెష్టివల్ అధికారి జంజం శ్రీనివాసరావు, దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవస్థాన సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి,పాలక మండలి సభ్యులు కీలుకుప్ప శ్రీనివాసులు, ముంగర సుధాకర్, రామయాణం సుధారాణి, స్థానిక ఏపిజిబి బ్యాంకు అధికారులు ఆలయ సిబ్బంది, ఎస్.సుబ్బరాయులు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు పోలీస్ సిబ్బంది, సేవాసమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో హైటెక్ మిస్ట్ మిషన్

– మల్టీ పర్పస్ కోసం కార్పొరేషన్‌కి మిస్ట్ మిషన్ – నగరాన్ని చల్లబరిచే సరికొత్త సాంకేతికత
– మిస్ట్ మిషన్ పనితీరుపై మంత్రి నారాయణ సంతృప్తి

నెల్లూరు, మే 18, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో పచ్చదనంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన మిస్ట్ మిషన్ రంగంలోకి దిగింది. నగరంలోని 14వ డివిజన్ ఏసీ నగర్ మల్లెల సంజీవయ్య ప్రాంగణంలో ఈ బహుళ ప్రయోజన మిషన్ పనితీరును రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రి మాట్లాడుతూ మిస్ట్ మిషన్ ద్వారా రోడ్డు డివైడర్ మధ్య ఉన్న మొక్కలపైకి అత్యంత వేగంగా నీటి తుంపర్లను విరజిమ్మి, వాటిపై పేరుకుపోయి న దుమ్ము, దూళిని పూర్తిగా వదిలించవచ్చన్నారు. దీని వల్ల మొక్క లు పచ్చగా, కళకళలాడుతూ ఎదుగుతాయని తెలిపారు. కేవలం మొక్కలకు జీవజలాన్ని అందించడమే కాకుండా, నగర రోడ్లను శుభ్రం చేయడానికి, వేసవిలో గాలిలోని వేడి శాతాన్ని తగ్గించి చల్లబరచడానికి ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వీటన్నింటితో పాటు నగరంలోని ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు , తక్షణమే నీటిని వెదజల్లి మంటలను అదుపు చేసే ప్రత్యేక అత్యవసర సౌకర్యం కూడా ఈ మిషన్‌లో ఉందన్నారు. నగర వ్యాప్తంగా ఇలాంటి అత్యాధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించబోతున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. మేయర్ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, అడిషనల్ కమీషనర్ హిమబిందు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, టీడీపీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

కోవూరు, మే18 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శివభక్త బృందం ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థాన చైర్మన్ నురేష్, భక్త బృందం సభ్యులు సుకుమార్, నాగరాజు, మోహన్, తదితరులు ఉన్నారు.